




వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కేసముద్రం మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన మిర్చి బస్తాలు

మిర్చి మార్కెట్లో అనధికార 'కోత'!

నగదు చెల్లింపుల్లో 3 శాతం 'కమీషన్'

- 8 రోజుల్లోనే రైతుల నుంచి రూ.33 లక్షల దోపిడీ
- అన్నదాతలకు రోజుకు రూ.4 లక్షల నష్టం

కేసముద్రం, ఫిబ్రవరి11 : ఆరుగాలం కష్టపడి మార్కెట్‌కు పంటను తెచ్చిన రైతులు దోపిడీకి గురవుతున్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మిర్చి రైతులకు నగదు చెల్లింపుల్లో కమీషన్ పేరిట కోత విధిస్తోండటంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం ఎనిమిది రోజుల్లోనే రైతుల నుంచి కమీషన్ రూపంలో రూ.33 లక్షలను వ్యాపారులు నగదు చెల్లింపుల్లో కోత విధించడం గమనార్హం.

మిర్చి ధరలు అధికంగా ఉన్నాయని పైకి చూపుతున్నప్పటికీ మార్కెట్లో నగదు చెల్లింపుల్లో మాత్రం నూటికి మూడు రూపాయల చొప్పున తగ్గించి రైతులకు ఇస్తున్నారు. 2021, జనవరి 28న అప్పటి మార్కెట్ చైర్మన్ మర్రి నారాయణరావు హయాంలో కేసముద్రం మార్కెట్లో తొలిసారి మిర్చి కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే తొలిసారి ప్రయోగాత్మకంగా మిర్చి కొనుగోళ్లను నిర్వహిస్తుండడంతో మహబూబాబాద్, వరంగల్ మార్కెట్‌లతో పోటీగా రాబడులను పెంచేందుకు వ్యాపారుల కోరిక మేరకు అనధికారికంగా నగదు చెల్లింపుల్లో 3 శాతం కోత విధించడం ప్రారంభించారు. నగదులో 3శాతం కోత ఒక్క ఏడాది కొనసాగించి మార్కెట్ పుంజుకున్న తర్వాత బంద్ చేయాలనే ఉద్దేశంతో అమలు చేసినట్లు రైతులు చెబుతున్నారు. మిర్చి మార్కెట్ ప్రారంభమై నాలుగేళ్లు అవుతున్నా ఈ అనధికారిక కోత పేరుతో దోపిడీ మాత్రం ఆగడం లేదు.

పొరుగు మార్కెట్లలో కోతలున్నాయనే సాకు..

మిర్చి కొనుగోళ్లలో నగదు చెల్లింపుల విషయంలో ఇతర మార్కెట్లలో కూడా నగదు కోతలు ఉన్నాయని, అలాగైతేనే అధిక ధరలు వస్తాయంటూ ఇక్కడ కూడా కమీషన్ ఉంటేనే కొనుగోలు చేస్తామని వ్యాపారులు ఈ సీజన్ ఆరంభానికి ముందు తెగేసి చెప్పారు. దీంతో పలుమార్లు వ్యాపారులు, రైతు సంఘాల నాయకులు మార్కెట్లో చర్చలు నిర్వహించి, మిర్చి ఖరీదుల్లోని నగదు చెల్లింపుల్లో 3 శాతం కోతకు అనధికారికంగా రైతు సంఘాల నాయకులు అంగీకరించారు. ఈ మేరకు మార్కెట్లో మూడుశాతం కోతతో ఖరీదులు కొనసాగుతున్నాయి. ఉదాహరణకు క్వింటాకు రూ.20 వేల చొప్పున ధర వచ్చిన రైతుకు 3 శాతం అంటే రూ.600 నగదు తగ్గించి ఇస్తారు. నగదు కోత వల్ల రైతుకు క్వింటాకు రూ.19,400 ధర వచ్చినట్లుగా పరిగణించాల్సివస్తోంది. వాస్తవానికి ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) నిబంధనల్లో కూలీ చార్జీలు, మార్కెట్ ఫీజు మినహా నగదు చెల్లింపుల్లో ఇతర కోతలు ఉండడం నిషేధం. దీంతో మార్కెట్ తక్‌పట్టీ వచ్చాక అనధికారికంగా 3శాతం కోత విధింపును లెక్కించి నగదు చెల్లింపుల్లో మినహాయిస్తున్నారు.

ఎనిమిది రోజుల్లోనే..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ఈ మిర్చి సీజన్ గతనెల 30వ తేదీన ప్రారంభం కాగా, సెలవులు మినహా ఈనెల 8 వరకు ఎనిమిది రోజులు మార్కెట్ కొనసాగింది. ఈ ఎనిమిది రోజుల్లో 4,947 క్వింటాళ్ల తేజ రకం మిర్చి, 923 క్వింటాళ్ల తాలురకం మిర్చిని వ్యాపారులు ఖరీదులు చేశారు. ఈ మిర్చి నగటు ధర ప్రకారం విలువ రూ.11 కోట్లు దీనిపై మార్కెట్ ఫీజు ఒక శాతం రూ.11 లక్షలు రాగా రైతుల నుంచి రూ.33 లక్షల వరకు 3 శాతం కమీషన్ పేరిట వ్యాపారులు కోత విధించారు. ఒక రోజుకు సగటున రూ.4లక్షలకు పైగా నగదు రైతుల నుంచి దోపిడీకి గురయ్యాయి. ఈ-నామ్‌లో ధరలు వేసి కొనుగోలు చేస్తూ నగదు చెల్లింపుల్లో కోత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మార్కెట్లో నగదు కోతలు లేకుండా మిర్చి కొనుగోళ్లను నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రూ.1,240లు కోత విధించారు

\- కామని కుమారస్వామి, మిర్చి రైతు, బోడమంచ్యాతండా

కేసముద్రం మార్కెట్‌కు ఈనెల 8న ఏడు బస్తాల్లో 2 క్వింటాళ్ల మిర్చి తీసుకురాగా క్వింటాకు రూ.20521 ధర రావడంతో రూ.41,312 అయినవి. నాకు రావాల్సిన నగదులో 3శాతం రూ.1240ల వ్యాపారి కోత విధించాడు. చెక్కు కావాలంటే 2శాతం కోత విధించి 8 రోజుల తర్వాత తేదీ వేసి ఇస్తానన్నాడు. డబ్బులు అవసరం ఉండడంతో రూ.1240లను వదులుకొని మిగిలిన నగదు తీసుకున్నా. మిర్చి ఖరీదుల్లో అనధికారిక కోతలను నిషేధించి పూర్తి డబ్బులు రైతుకు అందేలా అధికారులు చర్య తీసుకోవాలి.

మేడారంలో మొక్కుల జోరు

- సమ్మక్క సారలమ్మల దర్శనాలకు భక్తుల బారులు
- రద్దీగా మారిన మేడారం పరిసరాలు

మేడారం, ఫిబ్రవరి 11 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహాజాతర ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా వనదేవతలకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నలమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. 10 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) చెల్లించుకున్నారు.

గద్దెలను తాకి పులకించి

మహా జాతరకు ముందుగా సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి మేడారం తరలి వచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను తాకి తరించి పోతున్నారు. మహా జాతరలో అవకాశం రాకపోవచ్చని భావిస్తూ ముందస్తుగా కుటుంబ సభ్యులతో తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్నారు.

రద్దీని నియంత్రించని పోలీసులు

మహా జాతరకు ముందుగా వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన భక్తజనాన్ని గద్దెల వద్ద పోలీసులు నియంత్రించలేక పోయారు. దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు తమ కుటుంబ సభ్యులు, శాఖల అధికారులు, బంధువులు, మిత్రులకు ప్రత్యేక దర్శనాలు కల్పించే పనిలో పడ్డారు. సామాన్య భక్తులకు మాత్రం దర్శనాల్లో ఇబ్బందులు తప్పలేదు. వీఐపీ, వీవీఐపీల దర్శనాల కారణంగా దగ్గరకు వెళ్లలేని భక్తులు దూరం నుంచే బెల్లం, కానుకలు, ముడుపులు విసిరారు. భక్తులందరినీ సమ దృష్టిలో చూడాలని, సామాన్యులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

విద్యారంగానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి11 : ప్రభుత్వ విద్యారంగానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని మురళీకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి గత ప్రభుత్వాల కంటే బడ్జెట్ ఎక్కువగా కేటాయించడం అభినందనీయమన్నారు. ఎన్నికల హామీలో ప్రకటించినట్లుగా 15 శాతంకు పెంచాలని కోరారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతీ మండలానికి ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన అవసరమైన చోట ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాలలను పబ్లిక్ స్కూల్స్‌గా మార్చాలన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావ దుర్గభవాని మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు సీపీఎస్‌ను రద్దు, పెండింగ్‌లో ఉన్న మూడు బకాయిలను ప్రకటించాలన్నారు. ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం పేస్కేల్ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లారెడ్డి, నర్సింహారావు, యాకూబ్, నాగమల్లేశ్వర్, స్వప్న, నాగమల్లయ్య, నామ వెంకటేశ్వర్లు, భద్రునాయక్, వెంకన్న, బిక్షపతి, మంజుల, హుస్సేన్, జనార్ధనాచారి, వివేక్, సంజీవ, శ్రీనివాస్, ప్రవీన్, రాజశేఖర్, అజీజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జిల్లాలో 16 మంది ఎంపీడీవోల బదిలీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 : జిల్లాలో 16 మంది ఎంపీడీవోలను బదిలీ కాగా, ఇతర జిల్లా నుంచి 16 మందిని జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ ఎంప్లాయిమెంట్ (పీఆర్ఆర్ఈ) అనితా రాంచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ నుంచి గోవిందరావు, వి.చలపతిరావు, భారతి, కె.ధన్‌సింగ్‌లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. సత్యనారాయణరెడ్డిని సూర్యాపేట జిల్లాకు, జి.రవీందర్, ఎస్.కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, సరస్వతి, రోజారాణి, శశిధర్‌లను ఖమ్మం జిల్లాకు, వి.అపర్ణ రంగారెడ్డి జిల్లాకు, పి.వెంకటేశ్వర్లును హన్మకొండకు, డి.గోవిందరావును వరంగల్‌కు, కె.వెంకటేశ్వర్లు, కె.శ్యాంసుందర్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఎం.రామారావు, ఎం.మంగమ్మ, జి.రవీందర్‌ప్రసాద్, డి.శ్రీను, జి.రేవతి, ఎస్.విక్రమ్, డి.బాలరాజు, బి.అప్పారావు, కె.వీరబాబు, ఖమ్మం జిల్లా నుంచి సీహెచ్.సుభాషిణి, బి.రవికుమార్, షేక్.షిలాసాహేబ్, డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, బి.వేణుమాధవ్, బోనగిరి యాదాద్రి జిల్లా నుంచి ఈ.వీరస్వామిను మహబూబాబాద్ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఎగ్జామ్ రాసిన 2,805 మంది విద్యార్థులు



మహబూబాబాద్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆర్సీవో ప్రత్యూష

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : జిల్లా వ్యాప్తంగా గురుకుల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆదివారం ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు సాంఘిక సంక్షేమం గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ప్రత్యూష తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో వివిధ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించిన అర్హత పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,974 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా, 9 సెంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన పరీక్షకు 2,974 మంది హాజరుకానుండగా, 2,805 (94.32 శాతం) విద్యార్థులు పరీక్ష రాశారు.

మహబూబాబాద్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల సెంటర్‌లో 384 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 365 మంది పరీక్ష రాశారని ప్రత్యూష వివరించారు. తొర్రూరు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలలో 384కి గాను 367 మంది హాజరయ్యారని తెలిపారు. ఇనుగుర్తిలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో 384కి గాను 359 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని, మరిపెడ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలురలో 384కి గాను 255 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారని. మహబూబాబాద్ టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలురలో 286కి గాను 276 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారని. మరిపెడ టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలురలో 360కి గాను 343 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. గూడూరు మండలం దామరవంచ టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలురలో 312కి గాను 291 మంది పరీక్ష రాశారని, మానుకోట యశోదగార్డెన్ సమీపంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలురలో 240కిగాను 227 మంది హాజరని పేర్కొన్నారు. కురవి టీఎస్ఈఎంఆర్ఎస్‌లో 240కి గాను 222 మంది పరీక్ష రాశారని, అయితే జిల్లా వ్యాప్తంగా 2974కి గాను 2805 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 169 మంది గైర్హాజరైనట్లు ఆర్సీవో ప్రత్యూష తెలిపారు. ఇందులో 1,399 బాలురు (94.72 శాతం), బాలికలు 1406 (93.92 శాతం) మొత్తంగా 94.32 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలోని యశోదగార్డెన్ సమీపంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సెంటర్లను జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సందర్శించారు. కురవి ఏకలవ్య గురుకుల పాఠశాల, జిల్లా కేంద్రంలోని యశోదగార్డెన్‌సమీపంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర పాఠశాల సెంటర్లను సందర్శించినట్లు ఆర్సీవో వివరించారు.

తండాల్లో సంత్ సేవాలాల్ ఆలయం నిర్మించాలి

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 11 : ప్రతీ తండాలో సంత్ సేవాలాల్ ఆలయాన్ని నిర్మించాలని విద్యార్థి జేఏసీ చైర్మన్ గోపినాయక్ గిరిజనులను కోరారు. ఆదివారం సోమ్లాతండా జీపీలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రత్యేక వేష, భాష, సంస్కృతీసంప్రదాయం గల జీవన విధానాన్ని గిరిజనులు కలిగి ఉన్నారు. అందుకే దేశంలోని 29 రాష్ట్రాలలో ఏకైక లంబాడ భాషలో మాట్లాడే జాతి అన్నారు. దేశంలో గిరిజనులు సుమారు 20 కోట్లు ఉన్నారన్నారు. బంజారాల సమాజ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని, అదే విధంగా సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీలను అమలు చేసి తీరుతాం

- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి



మాట్లాడుతున్న హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

పెద్దవంగర, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బరాబర్ అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దవంగరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అధ్యక్షతన కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధితో పాటు నిరుపేదలకు ఆర్థికంగా వృద్ధిచేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారన్నారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ఎన్నికల్లో కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు సముచితస్థానం కల్పిస్తామని తెలిపారు. రోబోమే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ సభ్యులు నిరంజన్‌రెడ్డి, రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, సీనియర్ నాయకులు దుంపల శ్యామ్, దేవేంద్ర, వేముల వెంకన్న, ఉపేందర్, రవి, ముత్యాల పూర్ణచందర్, సీతారామ్, శ్రీనివాస్, సోమాచారి, తస్నీరు వేణు, హరిక్రిష్ణ, యాకన్న, రవి, సత్యం, స్వామి, సందీప్, సంతోష్, సాయి, సతీష్ పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : సమాజసేవలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కోరారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆదివారం ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తమ ఆరోగ్యాన్ని కాపుడుకునేందుకు వాకింగ్ చేస్తూనే.. సామాజిక సేవల్లో ముందువరుసలో నిలుస్తున్నారని చెప్పారు. మనిషి ఎదుగుదలకు సమాజం తోడ్పాడునందిస్తుందని, తాము ఎదిగాక బాధ్యతగా సమాజానికి సేవ చేయాలని చెప్పారు. కరోనా సమయంలో వైద్యులు, పోలీసులు, మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేశారని అలాంటి వారికి సహాయం చేయడం ఎంతో అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, బోనగిరి గంగాధర్, ఆకుల శంభయ్య, తండా సదానందం, నల్లు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, కృష్ణమూర్తి, నర్సింహారావు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్, కనకయ్య, పరంధామయ్య, గోపి, కుమార్, శేఖర్, మహిపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, వేణు, దుర్గారావు, వెంకన్న, రాజేందర్, పాపయ్య, దామోదర్ శర్మ పాల్గొన్నారు.

చిన్నారులను మింగిన చెరువులు

- వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి
- మల్హర్‌లో మేకలను మేపడానికి వెళ్లి ఇద్దరు అన్నదమ్ములు..
- అమ్మాపురంలో ఈతకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు..
- భూపాలపల్లి, మానుకోట జిల్లాల్లో విషాదం




అమ్మాపురం గ్రామ చెరువులో పడి మృతి చెందిన చిన్నారులు యాకూబ్, జంపా



అరుణ్ కుమార్, కార్తీక్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు





మల్హర్/తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 11: చెరువులో పడి నలుగురు చిన్నారులు మృతిచెందారు. మేకలను మేపేందుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు చెరువులో దిగగా నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ప్రమాదం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామంలో జరిగింది. అలాగే ఈత కొట్టేందుకు చెరువుకు సరదాగా వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. చిన్నారుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మేకలను మేపేందుకు..

భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన బొంతల అనూష-రాజు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమారులు అరుణ్ కుమార్ (12), కార్తీక్ (9)తోపాటు ఓ కూతురు ఉంది. అరుణ్‌కుమార్ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సమీపంలోని సన్నూర్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉన్న అతడు.. మూడు నెలల కిందట ఇంటికి వచ్చేశాడు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేకపోవడంతో అతడిని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పది రోజుల కిందట చేర్పించారు. రెండో కుమారుడు కార్తీక్ స్థానికంగా నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవలే రాజు కొన్ని మేకలను కొన్నాడు. వాటిని అతడి భార్య అనూష మేపుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాజు వ్యక్తిగత పని నిమిత్తం కాళేశ్వరం వెళ్లాడు. రోజూలాగే అనూష మేకలు మేపుకుంటూ ఇద్దరు కొడుకులను కూడా తోడుగా తీసుకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో అనూష పిల్లలు ఇద్దరికి మేకలను అప్పగించి భోజనం చేయడానికి ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మేకలు ఇంటికి చేరాయి. ఇద్దరు పిల్లలు మాత్రం తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి.. చుట్టుపక్కల వెతికింది. చెరువు వద్దకు వెళ్లి చూడగా ఇద్దరి చెప్పులు కనిపించాయి. దీంతో ఏడుస్తూ గ్రామంలోకి వచ్చి కొంతమందిని వెంట తీసుకొని వెళ్లింది. చెరువులో గాలించగా ఇద్దరి కొడుకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలాన్ని కాటారం సీఐ నాగేశ్వర్‌రావు పరిశీలించారు. ఇద్దరు పిల్లలు చెరువులో వద్దకు ఎందుకు వెళ్లారు.. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.


ఈతకు వెళ్లి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన గంధం స్వామి-రూప దంపతుల పెద్దకుమారుడు గంధం యాకూబ్ (14) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా తల్లి రూప, తమ్ముడు శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఉంటున్నాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన కిన్నెర మహేష్-సావిత్రి దంపతుల కుమారుడు జంపా (12) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా, నాన్నమ్మ గజ్జెలమ్మతో ఉంటున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వీరిద్దరు మరో నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు వద్దకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. చెరువు ఒడ్డున ఈతకొడుతూ ఒక్కసారిగా లోతులోకి వెళ్లారు. దీంతో ఇద్దరు చిన్నారులు నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కూచిపుడి జగదీశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంధం రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని.. ఐదేళ్ల బాలుడు మృతి

తల్లి పరిస్థితి విషమం, ఆస్పత్రికి తరలింపు

రెడ్యాల గ్రామంలో ఘటన




కొర్ని సాత్విక్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 : ట్రాక్టర్ ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి చెందగా, తల్లికి తీవ్రగాయాలై విషమంగా ఉన్న ఘటన శనివారం అర్ధరాత్రి మహబూబాబాద్ మండలం రెడ్యాలలో చోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.

రెడ్యాల గ్రామానికి చెందిన కొర్ని రాంమ్మూర్తి-సౌజన్య దంపతులకు ఏకైక కుమారుడు కొర్ని సాత్విక్ (5) సంతానం. గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి రోడ్డువెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు సాత్విక్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి సౌజన్యకు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. బాలుడి తండ్రి రాంమ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ రెడ్యాలకు చేరుకుని బాలుడి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వెంట లూనావత్ అశోక్‌నాయక్, నర్సింగ్ వెంకన్న, మందుల రఘు, రాజు, రాము, రాంచందర్, మహేష్, బాలునాయక్, హుస్సేన్ పాల్గొన్నారు.








కేయూ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: కేయూ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇక్కడికి బదిలీ అయిన శ్రీధర్ రాకను మంత్రి ద్వారా అడ్డుకున్నట్లు సమాచారం. కాగా, కొన్ని రోజుల కిందట వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు జరగగా.. కేయూలో పని చేసిన అబ్బయ్య పరకాలకు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఖమ్మంలో పని చేస్తున్న సీహెచ్. శ్రీధర్‌ను నియమించారు. అయితే శ్రీధర్ రాకపై సందిగ్ధత ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంపాటు ఎస్ఐ, సీఐగా పని చేసిన శ్రీధర్ అక్కడి బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అక్కడ చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలను వేధించడంతోపాటు కొందరిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ కమిషనరేట్‌లోని కీలకమైన కేయూ పీఎ్‌స్‌లో పోస్టింగ్ పొందడాన్ని అక్కడి నేతలు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. ఎలాగైనా శ్రీధర్ పోస్టింగ్‌ను రద్దు చేయాలని విదేశాల్లో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రిపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో సీపీకి విషయం తెలుపగా ఆయన నిఘావర్గాల ద్వారా శ్రీధర్ సర్వీస్ గురించి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి అధికారి శ్రీధర్‌కు ఫోన్ చేసి కేయూ పీఎస్‌లో జాయిన్ కావొద్దని సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో శ్రీధర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. అయితే కేయూకు వీఆర్, ఎస్‌బీలో ఉన్న ఓ అధికారుల్లో ఎవరికైనా విధులు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.







భారీగా ఎంపీడీవోల బదిలీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది ఎంపీడీవోలు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. మరో రెండు మాసాల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఒకే స్థానంలో మూడేళ్ల సర్వీసు పూర్తి అయిన ఎంపీడీవోలను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 395 మంది ఎంపీడీవోలు బదిలీ కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది బదిలీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 5 ఎంపీడీవోలు, జనగామ జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి 8 ఎంపీడీవోలు, మహబూబాబాద్ జిల్లా నుంచి 16 ఎంపీడీవోలు, ములుగు జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, వరంగల్ నుంచి 10 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. సోమవారం రిలీవ్ కానున్న ఎంపీడీవోలు మంగళవారం వారికి కేటాయించిన జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

- **హనుమకొండ జిల్లా ఎంపీడీవోలు :** జవహర్‌రెడ్డి ములుగు జిల్లాకు, టి.సునిత కరీంనగర్, జి.వెంకటరమణ వరంగల్, ఎల్.భాస్కర్ జయశంకర్ భూపాలపల్లి, ఆర్.రామకృష్ణ ములుగు బదిలీ అయ్యారు.
- **జనగామ జిల్లా ఎంపీడీవోలు:** మహ్మద్ హసీం సూర్యాపేట, బి.సురేందర్ ఖమ్మం, వి.అశోక్‌కుమార్ ఖమ్మం, శ్రీధర్‌స్వామి ఖమ్మం, పి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, వి.రాజా త్రివిక్రం సిద్దిపేట బదిలీ అయ్యారు.
- **భూపాలపల్లి జిల్లా ఎంపీడీవోలు:** కె.అనిల్‌కుమార్ హనుమకొండ, ఎల్.అరుంధతి వరంగల్, పి.ఆంజనేయులు వరంగల్, జి.సురేందర్ ఖమ్మం, ఎం.శంకర్ వరంగల్, జి.నరసింగహమూర్తి వరంగల్, ఎ.రవీంద్రనాథ్ ఆదిలాబాద్, వి.క్రిష్ణవేణి వరంగల్ బదిలీ అయ్యారు.
- **మహబూబాబాద్ జిల్లా ఎంపీడీవోలు:** జి.రవిందర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం, ఎం.సత్యనారాయణరెడ్డి సూర్యాపేట, జి.రవిందర్ ఖమ్మం, వి.అపర్ణ రంగారెడ్డి, పి.వెంకటేశ్వర్లు హనుమకొండ, బి.వి.చలపతిరావు భద్రాద్రి కొత్తగూడెం, ఎస్.కుమార్ ఖమ్మం, బి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, బి.భారతి భద్రాద్రి కొత్తగూడెం, కె.ధన్‌సింగ్ భద్రాద్రి కొత్తగూడెం, బి.గోవిందరావు వరంగల్, కె.శ్యాంసుందర్ జయశంకర్ భూపాలపల్లి, కె.వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి, పి.సరస్వతి ఖమ్మం, ఎ.రోజారాణి ఖమ్మం, కె.శేషాద్రి ఖమ్మం బదిలీ అయ్యారు.
- **ములుగు జిల్లా ఎంపీడీవోలు:** అబ్బూరి ఫణిచంద్ర వరంగల్, సీహెచ్.శ్రీనివాస్, వరంగల్, జె.ప్రవీణ్‌కుమార్ హనుమకొండ, ఎం.సత్యాంజనేయ ప్రసాద్ యాదాద్రి భువనగిరి, ఎండి.ఇక్బాల్ హుస్సేన్ జయశంకర్ భూపాలపల్లి, అద్దూరిబాబు జయశంకర్ భూపాలపల్లి బదిలీ అయ్యారు.
- **వరంగల్ జిల్లా ఎంపీడీవోలు:** సీహెచ్.సంతోష్‌కుమార్ సూర్యాపేట, టి.రాజ్యలక్ష్మీ ములుగు, ఎ.క్రిష్ణమూర్తి మెదక్, జి.క్రిష్ణ ప్రసాద్ ములుగు, ఎన్.విజయ్‌కుమార్ హనుమకొండ, ఎన్.వీరేషం హనుమకొండ, జి.రాజేంద్రప్రసాద్ ములుగు, పి.సుమనవాణి ములుగు, ఎం.వెంకటేశ్వర్‌రావు జయశంకర్ భూపాలపల్లి, జి.అనిత ములుగుకు బదిలీ అయ్యారు.

వైద్యులపై చర్యలు తీసుకోండి..

హసన్‌పర్తి పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: గాల్‌బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని తన భార్యను ఆస్పత్రిలో చేరిస్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణం పోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓ బాధితుడు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి తెలిపిన ఫిర్యాదు మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగ ల్ జిల్లా కరీమాబాద్ తోటకు చెందిన ఎమ్డీ అన్వర్ తన భార్య నస్రీన్‌కు గాల్ బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని చికిత్స కోసం ఆరెపల్లిలోని రిలీఫ్ ఆస్పత్రిలో ఈ నెల 5న చేర్పించారు. 9వ తేదీన అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత కొంత సమయానికి నస్రీన్‌కు మూత్రం ఆగిపోయింది. ఉదయం నుంచి సా యంత్రం వరకు చికిత్స చేసినట్టు చేసి చివరికి పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని వేరే ఆస్పత్రికి తీసుకుపోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడికి వెళ్లి చికిత్స చేస్తుండగా శనివారం సా యంత్రం నస్రీన్ మృతి చెందింది. తనభార్య మరణానికి రిలీఫ్ ఆస్పత్రి సిబ్బందే కారణమని, అక్కడి డాక్టర్లతోపాటు నిర్వాహకులను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

'మల్లికాంబ'లో అన్నదానం



అన్నదానం చేస్తున్న రామమ్ చిట్‌ఫండ్స్ ప్రతినిధులు

సుబేదారి, ఫిబ్రవరి 11: రామమ్ చిట్‌ఫండ్స్ 16వ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామమ్ చిట్‌ఫండ్స్ చైర్మన్ బన్న సుధాకర్, ఎండీ శ్రీరామోజు గిరిబాబు, చిట్‌ఫండ్స్ సిబ్బంది, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.




మేడారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాల

'ఆరోగ్య' జాతర!

- మేడారంలో పకడ్బందీగా వైద్య సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- 50 పడకలతో తాత్కాలిక వైద్యశాల
- జాతర పరిసరాలు, దారుల్లో 72 మెడికల్ క్యాంపులు
- 150 మంది డాక్టర్లు, 530 మంది పారామెడికల్ సిబ్బంది నియామకం

ములుగు, ఫిబ్రవరి 10: మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. ఈసారి ప్రభుత్వం రూ. కోటి నిధులను కేటాయించగా ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. జాతర పరిసరాల్లో తాత్కాలిక పెద్దాస్పత్రి, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఓపీ సేవలు కొనసాగుతుండగా, ఈనెల 20నుంచి జాతర ముగిసేంత వరకు ఇన్‌పేషెంట్ సేవలను అందించనున్నారు. ఎప్పటిలాగే మేడారం జాతరలో 50 పడకలతో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో తొమ్మిది మంది వైద్యనిపుణులు పనిచేయనున్నారు. షిఫ్టుకు 10మంది చొప్పున స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలతో ఇక్కడ ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ 24 గంటల సేవలను అందించనున్నారు. మేడారం ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో ఆరు బెడ్లతో మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. అదేవిధంగా జాతర పరిసరాల్లో 30మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. చింతల్, నార్లాపూర్, కొత్తూరు, కాల్వపల్లి క్రాస్‌రోడ్డు, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు-రెడ్డిగూడెం రోడ్ డ్యామ్, జంపనవాగు, ఊరట్టం కాజ్‌వే, రెడ్డిగూడెం, కొంగల మడుగు, ఆర్‌టీసీ బస్టాండు, ఇంగ్లీషు మీడియం స్కూల్, మేడారం చెరువు, పోలీసు క్యాంపు, చిలుకలగుట్ట, వీవీఐపీ పార్కింగ్ ప్లేస్, పడిగాపూర్, హరిత హోటల్, కొత్తూరు సబ్‌స్టేషన్, వెంగ్లాపూర్, మేడారం-తాడ్వాయి రోడ్డు, గద్దెల ప్రధాన ద్వారం, బయ్యక్కపేట రోడ్డు, కన్నెపల్లి జంక్షన్ రోడ్డు, ఊరట్టం రోడ్డు మామిడి తోట, మేడారం గ్రామపంచాయతీ సమీపంలోని రెండో గేటు వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అదేవిధంగా మేడారం వచ్చే ప్రధాన దారుల్లో కూడా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. గూడెప్పాడ్, కటాక్షపూర్, మల్లంపల్లి, గట్టమ్మ దేవాలయం, జంగాలపల్లి క్రాస్‌రోడ్డు, చల్వాయి క్రాస్‌రోడ్డు, లక్నవరం, పస్రా, కాల్వపల్లి, రేగులగూడెం, పెగడపల్లి, బోర్లగూడెం, కాటారం, తాడ్వాయి, బీరెల్లి, కొత్తూరు, కాటాపూర్, ఆకులవారి ఘనపూర్, ముల్లకట్ట బ్రిడ్జి, జగన్నాధపురం, చీకుపల్లి, టేకులగూడెం, వెంకటాపురం,


భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మంగపేట, మల్లూరు, రాజుపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్, బయ్యక్కపేట, దూదేకులపల్లి, రాంపూర్, మేడారం క్రాస్‌రోడ్డు, రామప్ప, గుర్రంపేట, గణపురం క్రాస్‌రోడ్డు వద్ద మొత్తం 42 క్యాంపులు ఏర్పాటవుతున్నాయి. భక్తులు చిన్న అనారోగ్యానికి గురైనా ఈ శిబిరాలను సంప్రదిస్తే అక్కడ 24గంటలు అందుబాటులో ఉండే డాక్టర్లు, సిబ్బంది వైద్యసేవలను అందించనున్నారు. ఇద్దరు డాకర్లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సహాయక సిబ్బంది కలిపి మొత్తం 10మంది విధుల్లో ఉంటారు.

680 మంది డాక్టర్లు, సిబ్బంది

వైద్య, ఆరోగ్య శాఖ పెద్ద సంఖ్యలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని జాతర విధులకు నియమించనుంది. 150 మంది వైద్యులు, 530 మంది పారామెడికల్ సిబ్బందితో భక్తులకు సేవలు అందించనుంది. ములుగు, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ జిల్లాల నుంచి 150 మంది డాక్టరను పిలిపిస్తున్నారు. అదే విధంగా ఎంజీఎం, సీకేఎం, రీజనల్ ఐహాస్పిటల్, జీఎంహెచ్ నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. 60మంది నాలుగో తరగతి ఉద్యోగులు సహాయకులుగా సేవలందించనున్నారు. ఐఎంఏ సహకారంతో ఓ గుండెవైద్య నిపుణుడిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ ఈసీజీ టెక్నీషియన్‌ను కూడా నియమించనున్నారు.


మేడారం తాత్కాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

40 బైక్ అంబులెన్స్‌లు

మహాజాతర సమయంలో మేడారం పరిసరాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దారులన్నీ ఇసుకేస్తే రాలనంత తయారవుతాయి. ఈ సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అత్యవసర సేవల కోసం బైక్ అంబులెన్స్‌లను వినియోగించనున్నారు. ఇందుకు 40బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌లు 16ను కూడా సిద్ధం చేస్తున్నారు. ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి, పస్రా ఆస్పత్రుల వద్ద అత్యవసర సేవల కోసం నాలుగు అంబులెన్స్‌లు, ఆరు ఆర్‌బీఎస్‌కే, మూడు ఎంసీహెచ్ వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు. అదేవిధంగా 120 మంది 108సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నారు.

ఏడుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లు

అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు జరిపేందుకు ఆరుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లను(రెఫరల్ హాస్పిటల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, భూపాలపల్లి, పరకాల సీహెచ్‌సీలు, తాడ్వాయిలోని పీహెచ్‌సీలో 10పడకలు, పస్రాలో ఐదు పడకలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

కొనసాగుతున్న వైద్యసేవలు

జనవరి 14 నుంచి మేడారంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 3,850 మందికి ఓపీ సేవలు అందించారు. 50వేల మాస్కులు, రూ.7లక్షల 50వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 13 నుంచి 24 గంటల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర జరిగే 21 నుంచి 24వ తేదీ వరకు ప్రతి రోజూ తొమ్మిది మంది వైద్య నిపుణులు 24 గంటలూ విధుల్లో ఉంటారు. తాడ్వాయిలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజ్ సెంటర్ నుంచి మందులు తెప్పిస్తున్నారు. ఈసారి కోటి 60లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. 2022 జాతరలో మొత్తం 2 లక్షల 9వేల మంది ఓపీ, 5,222మందికి ఐపీ సేవలు అందించింది.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

డాక్టర్ అల్లెం అప్పయ్య, ములుగు జిల్లా డీఎంహెచ్‌వో



మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. తాత్కాలిక ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 13నుంచి జాతర ముగిసేంత వరకు 24గంటల వైద్యసేవలు అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో జాతరలోని ప్రధాన ఆస్పత్రికి రాలేని పరిస్థితిలో ఇప్పుడు వాడుతున్న మందులను వెంట తెచ్చుకోవడం మంచిది. సురక్షితమైన ఆహారం, తాగునీటిని తీసుకోవాలి. ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. ఏదైనా అనారోగ్యం సోకితే సమీపంలోని వైద్య శిబిరానికి వెళ్లి ఉచితంగా సేవలు పొందాలి.


ములుగులో ఇసుక లారీలను దారి మళ్లిస్తున్న పోలీసులు

ఇసుక లారీలపై నియంత్రణేదీ?!

నిలుపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోని యంత్రాంగం

ములుగు, ఫిబ్రవరి11: మేడారం భక్తులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. జాతీయ రహదారి పనులకు తోడు ఇసుక లారీల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతోపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు వరంగల్, హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. జాతరకు సమయం దగ్గరపడుతుండగా పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాలలో తలివస్తున్నారు. ఆర్టీసీ కూడా స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. ఈనేపథ్యంలో లారీల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో ములుగు-గూడెప్పాడు మధ్య 163జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయి. గట్టమ్మ దేవాలయం-మల్లంపల్లి మధ్య రహదారి కంకర పోసి చదును చేస్తున్నారు. కల్వర్టు పనులూ కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో భారీగా వచ్చే వాహనాలు దారి ఇరుగ్గా ఉండటంతో ముందుకు కదలలేక పోతున్నాయి. ఆదివారం భూపాల్‌నగర్ స్టేజీ వద్ద ఓ లారీ రోడ్డుపైనే దిగబడటంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మేడారం భక్తులు, సాధారణ ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఇసుక లారీలను ములుగులో దారి మళ్లించారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుకు అనుమతించారు. గట్టమ్మ దేవాలయం మూలమలుపు వద్ద కల్వర్టు పనులు జరుగుతుండటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇసుక లారీలను నిలిపివేతపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఇటీవల మంత్రి సీతక్క అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే ఆదిశగా చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. జాతీయ రహదారి పనుల జాప్యంపై కూడా మంత్రి అసహనం వ్యక్తంచేశారు. అయితే పనులు జరుగుతున్న ప్రదేశాలు, ఇరుకైన కల్వర్టుల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటే కొంతవరకు సమస్య పరిష్కారమయ్యేది. కానీ, వాహనాలు నిలిచిపోయేదాకా ఎవ్వరూ స్పందించకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఇసుకలారీలపై ఆంక్షలు విధించాలని, జాతీయ రహదారి విస్తరణ జరిగే ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.


వనదేవతలకు మొక్కుతున్న మంత్రి సీతక్క, ఎస్పీ, పీవో

సకల సౌకర్యాలతో మహాజాతర

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 11: మహా జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జాతరకువచ్చే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్య కల్పిస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై మేడారానికి రానున్నారని, అందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామని అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు ఉన్నారు.

ఉత్సవ కమిటీని ప్రతిపాదించిన మంత్రి

మేడారం మహాజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీపై మంత్రి సీతక్క దేవాదాయశాఖ కమిషనర్‌కు 15మందితో ప్రతిపాదనలు పంపారు. చైర్మన్‌గా అరెం లచ్చుపటేల్‌తోపాటు 14 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. మిలుకూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచ షైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సిద్ధబోయిన జగ్గారావు పేర్లను పేర్కొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న గద్దెల ప్రాంగణం


బెల్లంతో వెళుతున్న భక్తురాలు

మేడారంలో మొక్కుల సందడి

వనదేవతల దర్శనానికి తాకిడి




యాటను మొక్కుతున్న దృశ్యం


వనదేవతల దర్శనానికి బెల్లంతో వెళుతున్న మహిళా భక్తులు


జంపన్నవాగు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న దృశ్యం

నల్గొండ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ముఖ్యకార్యకార్తలతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

పెద్దవంగర, ఫిబ్రవరి 11 : కృష్ణ జలాల పరిరక్షణలో భాగంగా 13న బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. అదివారం వడ్డెకొత్తపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ గుండెశస్త్ర చికిత్స చేసుకోవడంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ముఖ్యకార్యకర్తలతో కలిసి దయాకర్‌రావు మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెడుతోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు నెలలు గడవకముందే ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించిందన్నారు. కృష్ణా జలాల పంపిణీని కేఆర్‌ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించడం వల్ల ఎడమ కాల్వ రైతాంగం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ ఓడిపోయిందని కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, మోసపూరితమైన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయం సాధించారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు ఎంపీపీ తూర్పటి అంజయ్య, జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, మాజీ పాలకుర్తి దేవస్థాన ఛైర్మన్ రామచంద్రయ్యశర్మ, శ్రీరాం సుధీర్, ప్రమోద్, శ్రీనివాస్, మల్లికార్జున చారి, ఉషయ్య, కుమారస్వామి, సుభాష్, సతీష్, వెంకటేశ్వర్లు, కుమార్, నవీన్, సోంబాబు సాయి పాల్గొన్నారు.

దుర్గమ్మ వేడుకలో..

తొర్రూరు రూరల్ : తొర్రూరు మండలం కర్కాల గ్రామంలో నిర్వహించిన దర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమర్‌సింగ్‌తండా మాజీ ఎంపీటీసీ నానూనాయక్ భార్య మృతిచెందగా ఆమె కుటుంబాన్ని పరమార్శించి, కంఠాయపాలెం, మాటేడు గ్రామాల్లో వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బావిలో జారిపడి రైతు మృతి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడి ఓ రైతు మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా కేంద్రం శివారు చెరువుకొమ్ముతండాలో ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.

చెరువు కొమ్ముతండాకు చెందిన వాంకుడోతు సుందర్ (40) తనకున్న ఎకరంన్నర భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తన వ్యవసాయ పొలం పక్క బావివద్ద నుంచి వెళ్తుండగా రైతు జారి అందులో పడ్డాడు. పొలం వద్దకు వెళ్లిన సుందర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. బంధువుల ఇళ్లలో వాకబు చేసినా.. ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన కుటుంబసభ్యులకు వ్యవసాయ బావిలో సుందర్ విఘతజీవిగా కన్పించాడు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సుందర్ మృతదేహాన్ని బయటతీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఆయన వెంట లూనావత్ అశోక్‌నాయక్, రాజు, మందుల రఘు, రాము, బాలునాయక్, హుస్సేన్, మహేష్, లచ్చిరాం, బిక్షంనాయక్, రవీందర్‌నాయక్ ఉన్నారు.

ఖమ్మంలో రైలు కిందపడి గార్ల వాసి ఆత్మహత్య

గార్ల, ఫిబ్రవరి11 : ఖమ్మం రైల్వేస్టేషన్‌లో రైలు కిందపడి ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకోగా, ఈఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. కుటుంబసభ్యుల కథనం. ప్రకారం గార్లకు తోడేటి రామారావు (55) ఖమ్మం పట్టణంలోని బట్టలషాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు రమారావు వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో, రైల్వే పోలీసులు ఖమ్మం అన్నం ఫౌండేషన్ సహకారంతో శవపంచానామా నిర్వహించి, దహన సంస్కారాలు నిర్వహించారు. తండ్రి వారం రోజులుగా షాపుకురాక ఇంటికి రాకపోవడంతో గమనించిన కుమారుడు తోడేటి అశోక్ బంధువుల ఇళ్లతో పాటు స్థానిక పోలీసులకు సచాచారం అందించారు. రైల్వే పోలీసులు చూపిన ఫొటోల ఆధారంగా రామారావు మృతి చెందినట్లు తెలిసింది. మృతుడి భార్య గత ఐదేళ్ల కిందట ఆత్మహత్యకు పాల్పడింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలుకింద పడి ఒకరు..

డోర్నకల్ : డోర్నకల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-4 వద్ద గూడ్స్ రైలుకింద పడివ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఖమ్మం జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన గంపలోలు వీరనాథ్ (35) అనే వ్యక్తి ఆదివారం డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగాడు. అనంతరం ప్లాట్‌ఫాం-4పై నుంచి అప్పుడు కదులుతున్న గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు, డైరీ, ఫోన్ లభ్యం కావడంతో జీఆర్పీ పోలీసులు మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అన్నం ఫౌండేషన్ ఖమ్మం వారి సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

ముగిసిన ఎంపీపీఎల్ క్రికెట్ పోటీలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 4న ప్రారంభమైన మానుకోట పోస్టల్ ప్రీమియర్ లీగ్ (ఎంపీపీఎల్) క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. పోస్టల్ లైఫ్ఇన్సూరెన్స్ 140 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోస్టల్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో పోస్టల్ ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో వరంగల్ డివిజన్, మహబూబాబాద్ హెడ్‌పోస్టాఫీసుతో పాటు 16 ఉపతపాల కార్యాలయ సిబ్బంది పోటీల్లో పాల్గొన్నారు. ఈపోటీల్లో నేరడ సబ్ పోస్టాఫీసు, మహబూబాబాద్ హెడ్ పోస్టాఫీసు జట్లు ఫైనల్‌కు చేరుకుని తలపడగా హెడ్ పోస్టాఫీసు జట్టు కెప్టెన్ వాసం అనిల్ నాయకత్వంలో విజేతగా నిలిచింది. వారికి మహబూబాబాద్ హెడ్ పోస్టాఫీసు పోస్ట్‌మాస్టర్ పెండ్రా రాంచందర్, సబ్ పోస్ట్ మాస్టర్ కోట సుధాకర్ చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. వాసం అనిల్, తోట సురేష్, కోట సతీష్, భరత్, జాటోతు యాకూబ్, బానోత్ సుధాకర్, కొమ్మల బాబు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నర్సింహులపేట, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై జి.సతీష్ ఆదివారం తెలిపారు. మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారు ఆకేరు వాగు నుంచి శనివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని విచారించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హామీలను అమలు చేయడంలో విఫలం

● ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి ఉపేందర్

గూడూరు, ఫిబ్రవరి 11 : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను పరిష్కరించడంలో విఫలం చెందాయని ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ అన్నారు. గూడూరులో ఆదివారం ఎంసీపీఐ (యూ) మండల కమిటీని సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, సుదీర్ఘంగా ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఆ హామీలను అమలు చేయాలని ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి బందెల వీరస్వామి, కటకం బుచ్చిరామయ్య, గుండగాని సత్తయ్య పాల్గొన్నారు.

'విలీనం మహాసభలను సక్సెస్ చేయాలి'

నెల్లికుదురు, ఫిబ్రవరి 11 : ఖమ్మం జిల్లాలో జరిగే విలీనం మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్)ప్రజాపంద డివిజన్ కార్యదర్శి మంజంపెల్లి వీరన్న తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రంలో ఆదివారం సంబంధిత వాల్‌పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజపంథా, న్యూడెమొక్రసీ, ఇన్షియేటీవ్ మూడు పార్టీలు ఐఖ్యమై సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పేరుతో నూతనంగా ఆవిర్భవించిందన్నారు.ఏప్రిల్ 3నుంచి 5వరకు ఖమ్మంలో నిర్వహించే విలీనం సభకు వేలాదిగా తరలి రావాలన్నారు. నాయకుడు బండపెల్లి వెంకటేశ్వర్లు, ఇరుగు అనిల్, తారమ్మ, రాజారాం, మల్లయ్య పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి11 : వైద్య ఆరోగ్యశాఖలో ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. ఆదివారం మహబూబాబాద్‌లోని జగన్నాథ భవనంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు గత రెండు నెలలుగా పారితోషికాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. సమావేశంలో ఉపేంద్ర, పోతుగంటి మల్లయ్య, రమ, జ్యోతి, కవిత, స్వరూప, శకుంతల, కౌసల్య, శారద, లత, రమాదేవి, అరుణ, విజయ పాల్గొన్నారు.

నేటి నుంచి నాగేంద్రస్వామి ఆలయంలో..

నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు షురూ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం కొత్తబజారులోని శ్రీ నాగేంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 12 నుంచి 14 వరకు నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీనాగేంద్రస్వామి దేవాలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు ఎండ తగలకుండా చలువపందిళ్లు వేయడంతో పాటు హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 12న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సుప్రభాత సేవ, గణపతి, గోపూజలు, పుణ్యహవాచనం, 13న ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుప్రభాత సేవ, దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, మండల పూజలు, దేవతామూర్తి హోమాలు, 1108 బిందెలతో జలాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. 14న ఉదయం 5 గంటల నుంచి హోమం, వాస్తు పూజలు నవగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మహా అన్నప్రసాద వినియోగం చేపట్టనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సేవాలాల్ జయంతిని జరుపుకోవాలి

● సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోతు నందులాల్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఈనెల 15న జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని సేవాలాల్‌సేన జిల్లా అధ్యక్షుడు గుగులోతు నందులాల్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న ప్రతీ తండాలో హర్‌ఘర్‌భోగ్‌బండారో నిర్వహించాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సేవాలాల్‌సేనమహిళా జిల్లాఅధ్యక్షురాలు భూక్య స్రవంతిమోహన్‌నాయక్, బాదావత్ రాంబాబు, బానోత్ పూజ, నరేందర్, మాలు, రెడ్యా, సుమన్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న మునిసిపల్ పారిశుధ్య సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సమావేశాన్ని ఆదివారం కొమ్ము దేవేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 146 మునిసిపాలిటీల్లో 60 వేలమంది కార్మికులు పని చేస్తున్నారని వీరిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ నెల 16న జరుపతలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ సడక్‌బంద్‌లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, యూనియన్ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, కాగితం శ్రీనివాస్, పార్వంది కృష్ణ, ఎల్లయ్య, మనోహర్ పాల్గొన్నారు.

'సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి'



ఖమ్మం టీపీటీఎఫ్ సభలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర మెసెంజర్ల అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 రాష్ట్ర వ్యాప్తంగా మండల విద్యావనరుల కేంద్రాలు (ఎమ్మార్సీ)ల్లో గత22 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న మెసెంజర్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసే విధంగా చూడాలని మెసేంజర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బిక్షపతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఖమ్మంలో ఆదివారం ప్రారంభమైన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీఎఫ్) ద్వితీయ మహాసభలకు హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.అశోక్‌కుమార్, నాగిరెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002వ సంవత్సరం నుంచి మండల విద్యావనరుల కేంద్రాల్లో చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెసెంజర్లకు ప్రస్తుతం రూ. 17373 చెల్లిస్తుందని, స్వరాష్ట్రం తెలంగాణలో మాత్రం రూ. 11,050 మాత్రమే చెల్లిస్తుందని తెలిపారు. ఎమ్మార్సీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేసేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మానుకోట జిల్లా బాధ్యులు చుంచు శ్రీశైలం, నర్సింహారావు, మోహనకృష్ణ, ప్రణయ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

సీఎం, ప్రభుత్వ విప్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజన నేతలు

మరిపెడ, ఫిబ్రవరి11 : సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ఫ్లెక్సీకి ఆదివారం గాంధీ విగ్రహం దగ్గర మరిపెడ మండల లంబాడీ గిరిజనులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ నాయకుడు విజయ్ మాట్లాడారు. సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారంగా గుర్తించి ఫిబ్రవరి 15వ తేదీప్రభుత్వం ఐచ్ఛిక సెలవును ప్రకటించడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గుగులోత్ శ్రీనునాయక్, మరిపెడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్,అఫ్సర్, వేణు, సురేశ్‌నాయక్, దస్రూనాయక్, నెహ్రూనాయక్, మహేశ్, పాప్‌లాల్, రవీందర్, వీరన్న, ప్రసాద్, వెంకన్న, రమేశ్, గణేశ్, జితేందర్, గంగయ్య పాల్గొన్నారు.

ఉగ్గంపల్లి ఇందిరమ్మ కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు, ఫిబ్రవరి 11 : సీఎం రేవంత్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆదేశాలనుసారం ఉగ్గంపల్లి గ్రామ ఇందిరమ్మ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షుడు గండ్ల వెంకన్న తెలిపారు. అధ్యక్షుడిగా బోజ్యా వెంకట్యా, ఉపాధ్యక్షుడిగా భర్తపురం యాకయ్య ప్రధాన కార్యదర్శిగా భూక్య బాలు, వీరాచారి, సలహాదారులుగా రాజు, రాంమూర్తి, వెంకన్న, యాకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గండ్ల భద్రయ్య, ఉపాధ్యక్షుడిగా డీఎస్ మెగ్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ శ్రీపాల్, కార్యదర్శిగా కొంపెల్లి రవి, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా దాసరి యాకన్న, మహిళా అధ్యక్షురాలిగా బర్తపురం రమ, ఉపాధ్యక్షురాలిగా ధనమ్మ ఏకగ్రీవంగా నియమితులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జగన్, నాగ్యా శ్రీను, శ్రావణ్, మురళి, అజయ్, మహేష్, ప్రశాంత్, మదర్, అనిల్, యాకయ్య, పంతులు ఉన్నారు.

సిగ్నల్‌తండా నాయక్‌గా లక్ష్మణ్

డోర్నకల్, ఫిబ్రవరి 11 : డోర్నకల్ మునిసిపల్ పరిధిలోని సిగ్నల్‌తండ నాయక్‌గా అదే తండాకు చెందిన భూక్య లక్ష్మణ్‌ను తండవాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. తండవాసులకు చేదోడు.. వాదోడుగా ఉంటూ వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తుండడంతో లక్ష్మణ్‌ను తండ నాయక్‌గా ఎంపిక చేసుకున్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మణ్‌కు తలపాగ అమర్చారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, చాంప్లా తండ మాజీ సర్పంచ్ బానోత్ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ నున్సావత్ భద్రునాయక్ పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 11 : విద్యారంగానికి రాష్ట్రబడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి భూక్య సంతోష్ అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నిరసన తెలిపారు. విద్యార్థులు ప్రవీణ్, సాయి, సంతోష్, సిద్ధు, రాజేందర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



బానోత్ బిచ్చా (ఫైల్)

గార్ల, ఫిబ్రవరి 11 : మండలంలోని చిన్న బంజరతండాలో ఆదివారం శతాధిక వృద్ధుడు బానోత్ బిచ్చా (100) మృతి చెందాడు. గ్రామంలో పాతతరం పెద్ద మనిషిగా బిచ్చా ప్రజల మన్నలు పొందారు. రైతులకు ఏటా వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించేవాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు.

వధువరులను ఆశీర్వదించిన మంత్రి కోడలు

కొత్తగూడ, ఫిబ్రవరి 11 : సాధిరెడ్డిపల్లిలో నూతన వధువరులను ఆదివారం పంచాయతీరాజ్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖమంత్రి దనసరి అనసూయ సీతక్క కోడలు కుసుమాంజలి ఆశీర్వాదించారు. ఆమే వెంటటీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీచల్లా నారాయణరెడ్డి, సర్పంచ్ పుల్సం సరోజన పాపయ్య మండల యూత్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గురువు కూతురు పెళ్లికి రూ.1.55 లక్షల చేయూత

కేసముద్రం, ఫిబ్రవరి 11 : బాల్యంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు కూతురు వివాహానికి ఆయన శిష్యులంతా కలిసి కేవలం రెండు రోజుల్లోనే రూ.1.55లక్షలు సేకరించి తమ గురువు రుణం తీర్చుకున్నారు. 35 ఏళ్ల క్రితం కేసముద్రం మండలం కల్వల ప్రైవేటు స్కూల్‌ను పెరుమాండ్ల ఎల్లగౌడ్, రేణుక దంపతులు నిర్వహించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఎంతోమంది ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్నారు. ఆదివారం ఆ దంపతుల రెండో కూతురు రమ్య వివాహం నిర్వహిస్తుండడంతో రెండు రోజుల క్రితమే పూర్వ విద్యార్థులైన చందా గోపి, గంట సోమిరెడ్డి మరికొంతమంది చొరవ తీసుకొని వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.1.55 లక్షలను సేకరించారు. పెరటి జైపాల్‌రెడ్డి, గంట సోమిరెడ్డి, వేముల రాజేష్‌గౌడ్ రూ.6716ల చొప్పున, 10 మంది రూ.5వేల చొప్పున, మిగతా వారు రూ.3వేల నుంచి రూ.వెయ్యి వరకు ఇచ్చిన వారిలో 53 మంది పూర్వ విద్యార్థులు ఉన్నారు. గురువు కూతురు వివాహానికి శిష్య లు చేయూతనందించడంపట్ల పలువురు గ్రామస్తులు పూర్వ విద్యార్థులను అభినందిస్తున్నారు.

'మిత్రుడి కుటుంబానికి అండగా మేముంటాం'

గంగారం, ఫిబ్రవరి 11 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన తాళ్లపల్లి కిరణ్‌కుమార్ కుటుంబానికి ఆయన మిత్రులు అండగా నిలిచి రూ.లక్షా 80వేల రూపాయలను ఆర్థిక సహయంగా అందించి ఆదుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి పెద్దెల్లాపురం గ్రామానికి చెందిన తాళ్లపల్లి కిరణ్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈ నెల 3న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. విషయం తెల్సుకున్న అదే గ్రామానికి చెందిన మిత్రులు, ఆదర్శ యూత్ కమిటీ మెంటర్లు, కోమట్లగూడెం కోదండరామాలయం కమిటీ వారు మిత్రుని కుటుంబానికి విరాళాలు సేకరించారు. అలా వచ్చిన లక్షా ఎనభై వేల రూపాయలను మృతుని కుమార్తె తాళ్లపల్లి తనుజ (8) పేరున సుకన్య సంయోజన పథకంలో డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను వారి కుటుంబానికి అంద చేసి పలువురి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో సైపా సురేష్, ప్రతాపని శ్రీకాంత్, గాడుతుల అనిల్, గుండగాని రాజు, విరనేని దేవేందర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ లాల్‌బహదూర్ పాఠశాలలో నాటి గురువులతో 2003-2004 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని లాల్‌బహదూర్ పాఠశాలలో 2003-04 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత విద్యార్థులు అపూర్వ సమ్మేళనంలో ఒకే వేదికపై కలుసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగాపలకరించుకుని, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం భూపతి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రహీం, శంకర్, సంగీత, బారతి, రమణ, పూర్వ విద్యార్థులు పద్మం ప్రవీణ్, మహేందర్, ఫజల్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి మిత్రుల రూ.70 వేల ఆర్థిక సాయం



సింగారంలో ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 : మహబూబాబాద్ మండలం సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్ ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి కుటుంబానికి నెల్లికుదురుమండలం మునీగలవీడు హైస్కూల్లో 2009-10 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆదివారం రూ.70 వేల ఆర్థిక సాయం అందించారు. గతంలో కూడా ఇదే గ్రామానికి చెందిన సరిత అనే మిత్రురాలి కుటుంబానికి రూ.40 వేల సాయం చేసినట్లు చెప్పారు. మరోమిత్రుడు మురళీకృష్ణ కుటుంబానికి రూ.1,516 కూడా అందిచినట్లు చెప్పారు. అదే విధంగా పాఠశాలకు రూ.15 వేల విలువగల ఫ్యాన్‌లను బహూకరించినట్లు చెప్పారు. ముస్ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు పూర్వవిద్యార్థులు తెలిపారు.

సత్యనారాయణపురంలో అంకురారోహణ

బయ్యారం, ఫిబ్రవరి11 : విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం లో భాగంగా ఆదివారం సత్యనారాయణపురంలో అంకురారోహణతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. సత్యనారాయణపురం లో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 14న విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆలయంలో ఆదివారం భద్రాచలం శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయానికి చెందిన ముఖ్యఅర్చకుడు రామభద్రాచార్యులు నేతృత్వంలో పూజారులు, వేదపండితులు సంకల్పం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సం గ్రహణంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సకల జనుల సంక్షేమానికి అద్దం పట్టిన బడ్జెట్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామారాజు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సకల జనుల సంక్షేమానికి అద్దంపట్టేలా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంతన్ రామారాజు అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాలకు సముచితస్థానం కల్పిస్తూ బడ్జెట్‌కు రూపకల్పన చేశారని చెప్పారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ ఆస్తులపై సీబీఐతోవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాంశెట్టి ఉప్పలయ్య, అల్వాల లాలయ్య, షఫీ, వినోద్, విజయ్, సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

తొర్రూరు, ఫిబ్రవరి 11: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీవాసవీ మాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు ఆదివారం తొర్రూరు లోని వాసవీ మాత ఆలయంలో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు, హారతి, హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శివశర్మ మాట్లాడుతూ వాసవీమాత ఆర్యవైశ్య కులస్థుల కులదేవతగా వెలుగొందుతూ ప్రత్యేక పూజలు అందుకుంటుందని, ప్రతీ శుక్రవారం ఆలయ ఆవరణలో పూజలు ఉంటాయని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవీ మాత ఆలయ నూతన కమిటీ సభ్యులు

వాసవీమాత ఆలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొద్దుటూరి గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారంచేయించారు. వాసవీ మాత ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా చలువాది సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల నాగేశ్వర్ రావు, కోశాధికారిగా దారం కుమార స్వామితోపాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు వజినపల్లి అనిల్‌కుమార్, దీప, ఇమ్మడి వెంకటరమణ, సామ రామ్మూర్తి, మచ్చ సోమయ్య, మచ్చ సురేష్, బిజ్జాల అనిల్‌కుమార్, గోపారపు రామ ఉపేందర్, ఉప్పల నాగేశ్వర్ రావు, ఇమ్మడి రాంబాబు, సీహెచ్.రాము, రేగూరి నర్సయ్య, రవి, మోహన్‌రావు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.